RNI. NO. TEL TEL/2014/57821

# తెలంగాణ ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

TELANGANA EXPRESS

ఆదిలాబాద్ సంపుటి :15 సంచిక :278 గురువారం అక్టోబర్ 08, 2026 ఎడిటర్ : చింతల నీలకంఠం పేజీలు :8 నెల : రూ/ 3-

## డీపీఆర్ లేదు.. ఒప్పందమూ లేదు

- యాదాద్రి వైఫల్యాలన్నీ గత ప్రభుత్వానివే: భట్టి విక్రమార్క
- నాణ్యమైన బొగ్గు సరఫరాపైనా అప్పట్లో ఒప్పందం చేయలేదు
- యాదాద్రి విద్యుత్ ధర యూనిట్‌కు రూ.6.66.. భారం ప్రజలపైనే
- సింగరేణి బొగ్గు బ్లాకుల విషయంలోనూ గత

2



## ఎస్సీ రోస్టర్‌లో మార్పులైతే ఉద్యమమే..



- మంద కృష్ణ మాదిగ హెచ్చరిక
- మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలి
- సీఎం రేవంత్ హామీని వెంటనే అమలు చేయాలి
- విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు ఇవ్వాలి
- మార్చిలో 'ఛలో హైదరాబాద్' నిర్వహిస్తాం

2

# బ్రహ్మోత్సవాలకు టీటీడీ భారీ ఏర్పాట్లు

- అక్టోబర్ 10-19 వరకు సిఫార్సు లేఖలకు నో
- వీఐపీ, ప్రత్యేక దర్శనాలు రద్దు.. సామాన్య భక్తులకే ప్రాధాన్యం
- ఆరు రోజులకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో



## ఓటు.. సీటు చోరీకి కాంగ్రెస్‌కే పేటెంట్

2

- బోగస్ ఓట్ల తొలగింపును ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..?
- ఈసీపై నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం
- మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదు: బండి సంజయ్



## జంతర్ మంతర్ వద్ద రణరంగం!



- విపక్ష ఎంపీల అరెస్టు.. ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులు--ఎంపీల మధ్య వాగ్వాదం.. తీవ్ర తోపులాట
- మహిళా ఎంపీలపై చేయి వేస్తే ఊరుకోం: రేణుకా చౌదరి

2

## ఉద్యోగులకు డీఏ పెంపు.. తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్



- జనవరి 2024 నుంచి 37.31 శాతం.. జూలై 2024 నుంచి 40.04 శాతానికి పెంపు
- అక్టోబర్ జీతంతో పెంచిన డీఏ.. నవంబర్ 1న ఉద్యోగుల ఖాతాల్లో జమ
- డీఏ బకాయిలు 33, 27 వాయిదాల్లో చెల్లింపు.. జీపీఎఫ్ ఖాతాల్లో జమ

2

## కోట్లాది భారతీయుల విశ్వాసమే నా బలం



- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల ప్రస్థానం.. ప్రజల ఆశీర్వాదమే నడిపించింది: మోదీ
- 2001లో గుజరాత్ సీఎంగా తొలి అడుగు
- ప్రజల విశ్వాసం.. కార్యకర్తల శ్రమే విజయానికి బలం
- 2047 నాటికి వికసిత్ భారత్ సాధనపై ధీమా
- వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు.. దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు

2

# అభివృద్ధి పేరుతో అరాచకాలకు పాల్పడే వీ.డీ.సీలను ఉపేక్షించవద్దు

## బహిష్కరణల జాడ్యాన్ని రూపుమాపేందుకు కఠినంగా వ్యవహరించాలి

## రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**నిజామాబాద్, అక్టోబర్ 07:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ బ్యూరో**

)అభివృద్ధి పేరుతో అరాచకాలకు పాల్పడుతూ, అనాగరికంగా వ్యవహరించే గ్రామ అభివృద్ధి కమిటీల ఆగడాలను ఎంతమాత్రం ఉపేక్షించకూడదని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధికారులకు స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత కూడా ఇంకనూ పలు గ్రామాలలో సామాజిక బహిష్కరణలు, జరిమానాల పేరుతో సామాన్య ప్రజానీకాన్ని వేధింపులకు గురి చేయడం శోచనీయమని అన్నారు. ఈ జాడ్యాన్ని రూపుమాపేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సామాజిక బహిష్కరణ సంఘటనలపై బాధితులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది. ఆయా గ్రామాలకు చెందిన సుమారు 90 మంది బాధితులు కమిషన్ ప్రతినిధులను కలిసి తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ, లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ బహిష్కరణ ఉదంతాలు చోటుచేసుకున్న ప్రాంతాల అధికారులతో క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిస్థితుల గురించి, వీ.డీ.సీలపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ అరాచకాలకు పాల్పడే కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవడాన్ని తాము తప్పు పట్టడం లేదని, అయితే వీ.డీ.సీల ముసుగులో అమాయక ప్రజలను బహిష్కరణలు, జరిమానాలు విధించడాన్ని ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. తమను కలిసి ఆవేదన వెలిబుచ్చిన బాధితుల బాధలు కన్నీళ్లు తెప్పించాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ వైఖరిలో మార్పు తెచ్చేందుకు అధికారులు సమిష్టిగా, అంకితభావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీ.డీ.సీలు చట్ట పరిధిలో పని చేసేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని, దీనికోసం అదనపు కలెక్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదించారు. వీ.డీ.సీల అనైతిక చర్యలతో ఇబ్బందులకు గురి అయ్యే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. అవసరమైతే వారికి జిల్లా యంత్రాంగం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు కళా బృందాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దశాబ్దాల కాలంగా పాతుకుపోయిన ఈ రుగ్మతను దూరం చేయకపోతే భవిష్యత్తులో ఈ జాడ్యం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. వీ.డీ.సీలు చట్టానికి లోబడి పని చేసేలా, పౌరుల హక్కులు పూర్తి స్థాయిలో పరిరక్షించబడేలా, గ్రామగ్రామాన ప్రజల్లో అవగాహన పెంపొందించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందిస్తూ, జిల్లాలో సామాజిక బహిష్కరణలు వంటి రుగ్మతలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటామని అన్నారు. కమిషన్ చేసిన సూచనలను అమలు చేస్తూ, అరాచకాలకు పాల్పడే వీ.డీ.సీల ఆగడాలకు ముకుతాడు వేస్తామని స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

**త్వరలో అమలులోకి బీ.సీ ప్రొటెక్షన్ యాక్టు....**

కాగా, ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం తరహాలోనే వెనుకబడిన తరగతుల వారి కోసం తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే బీ.సీ ప్రొటెక్షన్ యాక్టును అమలులోకి తేనుందని బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. ఈ చట్టం అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి బీ.సీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన రూపంలో సమగ్ర నివేదిక సమర్పించిందని అన్నారు. బీ.సీ ప్రొటెక్షన్ యాక్టు అమలు పట్ల ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని, త్వరలోనే ఇది అమలులోకి రానుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి నిజామాబాద్, ఆర్మూర్ ఏ.సీ.పీలు ప్రకాశ్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, బీ.సీ కమిషన్ అధికారులు సునీత, ఇర్ఫాన్, సతీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాయికుమార్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక బహిష్కరణలపై రాష్ట్ర బీ.సీ కమిషన్ కు ఫిర్యాదులు

## విజ్ఞాపనలు సమర్పించిన బాధితులు





**నిజామాబాద్, అక్టోబర్ 07:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ బ్యూరో )**

సామాజిక బహిష్కరణ ఉదంతాలపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ ప్రతినిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు. బాధితులు నిర్భీతితో, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి, సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్ కు ఏకరువు పెట్టారు. బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

# మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

## ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

## కలెక్టర్ తో కలిసి ఎక్సైజ్ అధికారులతో సమీక్ష



**నిజామాబాద్, అక్టోబర్ 07:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ బ్యూరో**

)మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సమీక్ష జరిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవలి కాలంలో పల్లెల్లో గుడుంబా, నాటుసారా విక్రయాలు మళ్ళీ మొదలైనట్లు తెలుస్తోందని, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే ఇలాంటి మత్తు పదార్థాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు.యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న గంజాయి విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ఎన్ ఫోర్సుమెంట్, ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని, ఎక్కడ కూడా మత్తు పదార్థాల జాడ కానరాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా కల్తీకల్లు విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడైనా కల్తీ కల్లు కారణంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే, అందుకు ఎక్సైజ్ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగిస్తున్న అల్ప్రాజోలం, డైజోఫాం, క్లోరోఫాం ఎక్కడి నుండి వస్తుంది, సరఫరాదారులు ఎవరు అనే మూలాలను అన్వేషించి, సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను రవాణా చేసే వారిని, వాటిని విక్రయిస్తున్న వారిని, వాటిని వినియోగిస్తున్న వారిని పక్కాగా గుర్తిస్తూ నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని, జిల్లాలో ఎక్కడ కూడా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం, గుడుంబా, నాటుసారా వంటివి ఉనికిలో లేకుండా జిల్లాను మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరం లోపు సిగరెట్లు, గుట్కాలు వంటి విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ పి సామ్ కోషి కు శుభాకాంక్షలు.

## జనసేన పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు



**హైదరాబాద్ అక్టోబర్ 07:(తెలంగాణ ఎక్స్ ప్రెస్)**

:తెలంగాణ జనసేన పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ పి. సామ్ కోషి ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం కె.పి. విజయ్ కుమార్ గౌడ్, ఎం. వెంకట్ రామ్ రెడ్డి, వై.గంగ కీర్తి,పి. వీర రెడ్డి తదితరుల మార్గదర్శకత్వంలో నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయవ్యవస్థ పట్ల గౌరవం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర తదితర అంశాలపై చర్చించారు.పేదలు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారికి అవసరమైన న్యాయపరమైన సహాయం అందించడమే జనసేన పార్టీ లీగల్ సెల్ ప్రధాన లక్ష్యమని కె.పి. విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. సమాజంలోని పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, బలహీన వర్గాల ప్రజలు న్యాయం కోసం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జనసేన పార్టీ లీగల్ సెల్ తన వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు.న్యాయ సహాయం అవసరమైన వారికి సాధ్యమైన మేరకు న్యాయపరమైన మార్గదర్శకత్వం, సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలకు రాజ్యాంగ హక్కులు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు, న్యాయం కోసం పోరాడుతున్న వారికి అండగా నిలవడం లీగల్ సెల్ బాధ్యతగా భావిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్‌కు చెందిన పలువురు న్యాయవాదులు, నాయకులు పాల్గొన్నారు.

# రామారెడ్డి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



**కామారెడ్డి, అక్టోబర్ 7:-(తెలన్గానా ఎక్స్ ప్రెస్ బ్యూరో )**

రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రతను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా బాధ్యతగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: షబ్బీర్ అలీ





**కామారెడ్డి, అక్టోబర్ 7:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ బ్యూరో )**

బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. చైర్మన్‌గా సుతారి రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించారు.ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ... రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తదితర సేవలు సకాలంలో అందేలా సొసైటీలు పనిచేయాలని సూచించారు. రాజకీయ భేదాలకు తావులేకుండా ప్రతి రైతుకు సమానంగా సేవలందించి సొసైటీలను బలోపేతం చేయాలని కోరారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 30 వేలు ఇవ్వాలి

## - సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు కె.రాజనర్సు



**, అక్టోబర్ 7,(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 30 వేల రూపాయల ఇవ్వాలని, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.రాజనర్సు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మికుల సమస్యల చర్చించారు. ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం 15,600 రూపాయలు ఇవ్వాలి, పిఎఫ్ డబ్బులు కట్టాలి కొంతమందికి గ్రూపులు కాలేవు వారికి గ్రూప్ అకౌంట్లు చేయాలి పనిభారం ఎక్కువ ఉన్నందువల్ల కొత్త కార్మికులను తీసుకోవాలని, నెలలో రెండు లీవులు, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలి అని నిర్ణయించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రం కు రావాలని, ఈనెల 26న చలో ఇంద్ర పార్కు కు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం 30 వేలు అమలు చేయకుంటే సమ్మె చేయడానికి వెనకాడమని రాజనర్సు హెచ్చరించారు.

**ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికుల అధ్యక్షునిగా వెంకటేష్.....**

ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికుల అధ్యక్షుడిగా వెంకటేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె .రాజనర్సు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సాధారణ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మున్సిపల్ కార్మికుల అధ్యక్షునిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా టీ చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా వేణు గౌడ్ , బక్కోళ్ల సాయవ్వ, మల్లయ్య. తొగరి పోశవ. బ్యగారి లక్ష్మి, పి.సాయవ్వ, కోశాధికారిగా పుర్ర సాయిలు, ప్రశాంత్, సాయి, కార్యదర్శిగా శివశంకర్. బాలకృష్ణ, ఆర్గనైజర్ విజేందర్, విజయ, సలహాదారులు ప్రదీప్, కొండంగారి కృష్ణ, కార్యవర్గ సభ్యులు కిషన్, నీలియా, సాయిబాబా , ఎస్ కృష్ణయ్య, సిద్ధిరాములు, లక్ష్మణ్, వెంకటేశం, శ్యామ్, సాయిలు, విజయ్, చిన్న మల్లేష్, ఒంటి గారి సాయిలు , తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

### రోడ్డుపై భిక్షాటన చేస్తున్న చిన్నారులను

# చేరదీసిన పట్టణ సీఐ కరుణాకర్

**చదువుకుంటారా.. చదివిస్తా" అంటూ ఆప్యాయంగా పలకరింపు**




**జగిత్యాల అక్టోబర్ 7 (తెలంగాణ ఎక్స్ ప్రెస్)**

చేతుల్లో పుస్తకాలు పట్టుకుని బడికి వెళ్లాల్సిన చిన్నారులు.. బిక్షాపాత్రలు పట్టుకుని రోడ్డుపై నిల్చున్న దృశ్యం జగిత్యాల పట్టణంలో కలచివేసింది. ఎండను సైతం లెక్కచేయకుండా తల్లిదండ్రులతో కలిసి భిక్షాటన చేస్తున్న నాలుగైదేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులను చూసిన జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ చలించిపోయారు. విధులకు వెళ్తున్న సమయంలో తహసీల్ చౌరస్తా వద్ద ఈ దృశ్యం ఆయన దృష్టికి రావడంతో వెంటనే వాహనాన్ని ఆపి చిన్నారుల వద్దకు వెళ్లారు. చిన్నారులను ఆప్యాయంగా చేరదీసిన సీఐ కరుణాకర్ వారితో కొద్దిసేపు మాట్లాడారు. "చదువుకుంటారా.. మిమ్మల్ని చదివిస్తా" అంటూ వారిలో భరోసా నింపారు. పోలీసు అధికారి వెంట వస్తామని చిన్నారులు చెప్పడంతో వారిని ఆటోలో ఎక్కించి సురక్షితంగా తరలించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించి, చిన్నారుల సంక్షేమం, విద్య, భద్రతకు సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టేలా చర్యలు ప్రారంభించారు. సాధారణంగా విధుల్లో భాగంగా వెళ్లిపోకుండా, చిన్నారుల పరిస్థితిని గమనించి వెంటనే స్పందించిన సీఐ కరుణాకర్ చొరవ అభినందనీయం. పోలీసు విధుల్లో నేర నియంత్రణతో పాటు సమాజంలోని బలహీన వర్గాలు, ముఖ్యంగా చిన్నారుల భద్రత, సంక్షేమంపై కూడా పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటి చెప్పింది.

## గురుకుల విద్యార్ధులకు సి పి ఆర్ పై అవగాహన....



**ఎల్లారెడ్డి, అక్టోబర్ 7,(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు , బుధవారం ఎంవర్సిటి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఫాకల్టీ వారు సిపిఆర్ గురించి అవగాహన కల్పించినట్లు, ప్రిన్సిపాల్ జీ.నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు గుండె పోటుకు గురైన వ్యక్తికి ప్రాథమికంగా చేయాల్సిన అత్యవసర చికిత్సల్లో బాగంగా సిపిఆర్ చేసే విధానం గురించి ప్లాస్టిక్ బొమ్మకు సిపిఆర్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. అలాగే ఇంటర్ పాసైన తర్వాత విద్యార్థులు ఏవిధమైన విద్యను అభ్యసించాలి, ఏ కోర్సు చేస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి, అనే విషయమై కెరీర్ గైడెన్స్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం వారు తమ ఎంవర్సిటీ కి చెందిన లోగోతో కూడిన గిఫ్ట్ ను ప్రిన్సిపాల్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ.నాగేశ్వర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఎంవర్సిటీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఫ్యాకల్టీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి యువకుని దుర్మరణం



**కొడిమ్యాల అక్టోబర్ 6 (తెలంగాణ ఎక్స్ ప్రెస్)**

నాచుపల్లి నుండి దొంగలమర్రి వెళ్ళు మార్గం మధ్యలో కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన జిట్టవేణి మధుసూదన్(32) తన ద్విచక్ర వాహనంపై దొంగల మర్రి వైపు వెళ్తుండగా అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన బర్రెను ఢీకొట్టగా తీవ్ర గాయాలై ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు మృతుని తండ్రి జిట్టడవేణి లచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని స్థానిక ఎస్సై నరేష్ తెలియపరిచారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వాహనాన్ని నడుపుతున్నప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనములు నడపాలని సూచించారు

### మత్తమాలా సొసైటీ

## నూతన చైర్మన్‌గా జైపాల్ రెడ్డి....

**నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం.....**

**ఎల్లారెడ్డి, అక్టోబర్ 7,(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

మత్తమాల సొసైటీ నూతన చైర్మన్ గా బెల్లంగారి జైపాల్ రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి, బుధవారం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు మానిటరింగ్ అధికారి విజయలక్ష్మి సమక్షంలో సొసైటీ నూతన చైర్మన్ తో పాటు నియామకమైన 12 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గంలో చైర్మన్ గా బెల్లంగారి జైపాల్ రెడ్డి, డైరెక్టర్లుగా నీరుడి హన్మంతు, గండ్ల నవీన్, పేరు రాములు, మాల సాయవ్వ, ఎస్. సుశీల, గర్గుల చిన్న సంజీవులు, కటికెల శ్రీనివాస్, ఎరుకల అంజయ్య, కొట్టం లక్ష్మీ, కోడూరి చంద్రయ్య, ఎస్.అంజయ్య లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. నూతన చైర్మన్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ... రైతులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనను చైర్మన్ గా నియామకం చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్తమాల సెక్రటరీ పవన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల విద్యార్థి భద్రతలో నిర్లక్ష్యం..

**కలెక్టర్ తీవ్ర ఆగ్రహం.**

**ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్..స్కావెంజర్‌ను విధుల నుంచి తొలగింపు.**

**నిర్మల్, అక్టోబర్ 07, (తెలంగాణ ఎక్స్ ప్రెస్):**



తానూర్ మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల సమయం ముగిసిన అనంతరం తరగతి గదిలోనే ఉండిపోగా, గది తాళం వేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. స్వప్నను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో అలసత్వం వహించిన పాఠశాల స్కావెంజర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ బుధవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పాఠశాల ముగింపు సమయంలో ప్రతి విద్యార్థి సురక్షితంగా పాఠశాల నుంచి బయటకు వెళ్లాడా లేదా అనే విషయాన్ని ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు లేకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా చర్యలను ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల ప్రారంభం నుంచి ముగింపు వరకు విద్యార్థుల భద్రతకు సంబంధించి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల రక్షణ, భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, భవిష్యత్తులో జిల్లాలోని ఏ పాఠశాలలోనూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.**

**నిర్మల్, అక్టోబర్ 07 (తెలంగాణ ఎక్స్‌ప్రెస్):**

రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతను మెరుగుపరచడం, జీరో ఫాటాలిటీ జిల్లాల సాధనే లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇళంబరిది పాల్గొని రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) నుంచి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన తదితర ప్రమాద కారణాలపై సమీక్షించారు. జీరో ఫాటాలిటీ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి, అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో పనిచేసి రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అలాగే సేఫ్ లైఫ్ ఫౌండేషన్ -- మార్గదర్శక్ వెబ్‌సైట్‌లో రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్లు, రహదారి భద్రతకు సంబంధించిన వివరాలతో పాటు చేపడుతున్న నివారణ చర్యలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్ డీఎస్పీపి శ్రీనివాస్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తాండూర్ కిచ్చన్నపేట: పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణం

**అధ్యక్షులుగా బొగుడమీది శ్రీధర్ గౌడ్**

**నాగిరెడ్డిపేట ,అక్టోబర్ 7 (తెలంగాణ ఎక్స్ ప్రెస్)**



నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట పీఏసీఎస్ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ధర్మారెడ్డి గ్రామానికి చెందిన బొగుడమీది శ్రీధర్‌గౌడ్ చైర్మన్‌గా ప్రమాణం చేశారు. ఎల్లారెడ్డి క్లస్టర్ సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మణ్ చైర్మన్‌తో పాటు 12 మంది డైరెక్టర్లతో ప్రమాణం చేయించారు. డైరెక్టర్లుగా భూమా భూపతి గౌడ్,మ్యాదరి లక్ష్మి,గూల శివరాములు,బెస్త పోచవ్వ, భూమిని చిన్న దుర్గయ్య, మునిగేపల్లి సంగయ్య, జంబికుంట జీవయ్య, బోరంచ సుశీల,కోర్ర వజ్రా నాయక్,లంబాడి తులూజా,కానాపురం నరసమ్మ,గడ్డం భాస్కర్ రెడ్డిలు ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ...రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సేవ చేసుకుంటామని,సంఘం అభివృద్ధి దేహంగా పనిచేస్తామని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాండూర్ కిచ్చన్నపేట పాలకవర్గం సభ్యులుగా ఎన్నికకు సహకరించి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసి చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి,మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ సురేందర్ గౌడ్,తాసిల్దార్ వెంకట్ రెడ్డి, సీఈవో చంద్ర మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు,రైతులు పాల్గొన్నారు.

# మైనార్టీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంఏ నయీమ్

**నియామక పత్రం అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

**పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నేతలకు పిలుపు**

**కోరుట్ల, అక్టోబరు 7 (తెలంగాణ ఎక్స్‌ప్రెస్):**

జగిత్యాల జిల్లా మైనార్టీ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎంఏ నయీమ్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, తెలంగాణ వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గాజంగి నందయ్య, జువ్వాడి నర్సింగరావులు కలిసి ఎంఏ నయీమ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ఓటు చోరీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. కోరుట్ల అభివృద్ధికి జువ్వాడి సోదరులు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే కోరుట్లకు చెందిన ఎంఏ నయీమ్‌కు జిల్లా మైనార్టీ అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతోపాటు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులుడీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని కోరారు. కోరుట్లకు చెందిన ఎంఏ నయీమ్‌కు జిల్లా మైనార్టీ అధ్యక్ష పదవి రావడంలో జువ్వాడి నర్సింగరావు కృషి ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికే నామినేటెడ్ పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. రూ.8.16 కోట్లతో పుష్కరాల పనులుజువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పుష్కరాల కోసం ఇప్పటివరకు రూ.8.16 కోట్ల నిధులు తీసుకొచ్చామని, సీఎం సహాయనిధి ద్వారా రూ.8 కోట్ల విలువైన చెక్కులు అందజేశామని చెప్పారు. త్వరలో మరో రూ.60 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తామన్నారు.కోరుట్లకు రూ.12 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. కోరుట్ల నియోజకవర్గానికి రూ.12 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలకు కొత్త కోర్సు మంజూరైందన్నారు. ఆర్టీఏ కార్యాలయానికి సొంత భవనం కోసం రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, పలువురు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ...

**- ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్**

**ఎల్లారెడ్డి, అక్టోబర్ 7,(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో లబ్దిదారులకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' కింద మంజూరైన ఇళ్లకు, బుధవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా గుడిసెలు, రేకుల ఇళ్లు లేకుండా ప్రతి పేదవాడికి పక్కా ఆర్‌సీసీ భవనం నిర్మించి ఇవ్వడమే సర్కార్ లక్ష్యం అని అన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రత్యేక చొరవతో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కమిషనర్ జె.జగ్జీవన్, డిసిసి ఉపాధ్యక్షులు మంచిర్యాల విద్యాసాగర్, కౌన్సిలర్లు సిద్ది శ్రీధర్, సయ్యద్ గఫార్, అట్కరి చంద్రయ్య, ఎరుకల దశరథం, కో-ఆప్షన్ సభ్యులు పప్పు వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు రఫీక్, వసీమ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీల సమస్యలపై ముందుండి పోరాడాలి

## ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలి..

## కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ



**కోరుట్ల, అక్టోబరు 7 (తెలంగాణ ఎక్స్‌ప్రెస్):**

మైనారిటీ వర్గానికి చెందిన ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నాయకులు ముందుండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ పిలుపునిచ్చారు. కోరుట్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మైనారిటీల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మైనారిటీ వర్గానికి అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జిల్లా మైనారిటీ చైర్మన్ సమన్వయంతో పనిచేయడం ముఖ్యమని అన్నారు. ఇరువురి మధ్య మంచి అవగాహన ఉంటే పార్టీ కార్యక్రమాలు మరింత సమర్థంగా సాగుతాయని పేర్కొన్నారు. కమిటీలు, పార్టీ కార్యక్రమాల విషయంలో పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా అంశంపై చర్చ జరుగుతోందని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఓటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషికాంగ్రెస్ నూతన జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ నయీంమైనారిటీల సమస్యలను జిల్లా స్థాయిలో మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ నయీం తెలిపారు.మైనారిటీలకు పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పించేందుకు వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మైనారిటీ వర్గానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి దక్కిందని, అనంతరం దాదాపు పదేళ్లపాటు ఆ అవకాశం లభించలేదన్నారు. ప్రస్తుతం జువ్వాడి నర్సింగరావు చొరవతో మైనారిటీ వర్గానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కల్పించడంతో పాటు, తనకు జిల్లా మైనారిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ మైనారిటీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నయీం తెలిపారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఒకరి మృతి



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 7:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్)**

నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన నుక్కని పోచయ్య(44) తాగుడుకు బానిసై భార్య స్వరూపతో గొడవ పడి జీవితం విరక్తి చెంది ఉరి వేసుకొని మృతి చెందినట్లు స్థానిక పోలీసులతో తెలిపారు. గత కొంతకాలంగా తాగుడుకు బానిసై ఏ పని చేయకుండా జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని చెరువు కట్ట పై ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులు పేర్కొన్నారని స్థానిక పోలీసులు తెలిపారు.

## పెన్షన్ దరఖాస్తులను పరిశీలించిన డిప్యూటీ సీఈవో సురేందర్



**నాగిరెడ్డిపేట ,అక్టోబర్ 7 (తెలంగాణ ఎక్స్ ప్రెస్)**

నాగిరెడ్డిపేట మండలంలోని గోలి లింగాల,చినూర్ గ్రామాలలో బుధవారం జిల్లా డిప్యూటీ సీఈవో సురేందర్ పెన్షన్ దరఖాస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించారు.దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అందరి దరఖాస్తులను పరిశీలించి పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్,పంచాయతీ కార్యదర్శులు సంతోష్ కుమార్,అనిత,ఫీల్డ్ అసిస్టెంట్లు లింగా గౌడు, అంజయ్య ఉన్నారు.

## సొసైటీ పాలకవర్గమును సన్మానించిన గోపాల్పేట్ సర్పంచ్





**నాగిరెడ్డిపేట ,అక్టోబర్ 7 (తెలంగాణ ఎక్స్ ప్రెస్) నాగిరెడ్డిపేట**

మండలంలోని మాల్తుమ్మెద సొసైటీ పాలకవర్గం నూతనంగా ఎన్నికైన సందర్భంగా గోపాల్పేట్ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.మాల్ తుమ్మెద సొసైటీ పాలకవర్గం రైతుల సమస్యలపై దృష్టి సాధించాలని రైతులకు అందుబాటులో ఉంటూ సరిపడా సేవలు అందించాలని గోపాల్పేట్ గ్రామ సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపాల్పేట్ గ్రామ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్,మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ సురేందర్ గౌడ్,ఉప సర్పంచ్ గులాబ్ హుస్సేన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మురళి మోహన్ గౌడ్, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి,గంపల వెంకన్న,సుగుణ,పద్మ, యాదమ్మ,భీమయ్య, సొసైటీ సిబ్బంది యాదగిరి, యాదుల్,విక్రమ్,కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## జుక్కల్‌లో కాంగ్రెస్ నిరసన

**కామారెడ్డి, అక్టోబర్ 7:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ బ్యూరో )**

జుక్కల్‌లో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం నిరసన చేపట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి ఎంపీల అరెస్టులను ఖండిస్తూ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.





## నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

### లబ్ధిదారులకు చెక్కులు

### పంపిణి చేసిన వైస్ చైర్మన్ హన్నన్ జావీద్



**జహీరాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణా ఎక్స్ ప్రెస్):**

నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని, అనారోగ్యానికి గురై సొంత ఖర్చులతో వైద్యం చేసుకున్న అనంతరం ఆసుపత్రి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వనికి దరఖాస్తు రూపంలో సమర్పిస్తే ప్రభుత్వం పరిశీలించి సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో లబ్ధిదారులకు చెక్కులను అందిస్తుందని కోహిర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నన్ జావీద్ అన్నారు. బుధవారం నాడు కోహిర్ పట్టణ కేంద్రంలో ఇద్దరు లబ్ధిదారులకు షహీజది బేగం, ఇడిగి రచయ్య లకు 95 వెయ్యిల విలువగల చెక్కులను వైస్ చైర్మన్, కౌన్సిలర్ ప్రతినిధి అబ్దుల్ వాహిద్ లు కలిసి సిఏం రిలిఫ్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్యక్రమలు అమలు చేస్తుందని, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ మెంబర్ జలిల్ ఆహేమద్, నర్సింలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్ పై భగ్గుమన్న యువజన కాంగ్రెస్

### కేంద్రం వైఖరిపై మండిపడ్డ జిల్లా అధ్యక్షులు నరేష్ గౌడ్

### ఐబి గెస్ట్ హౌస్ ముందు ధర్నా చేసిన యూత్ కాంగ్రెస్ శ్రేణులు





**జహీరాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణా ఎక్స్ ప్రెస్):**

కేంద్ర ఎన్నికల సంఘం కోర్టు చోటు చేసిందని ఆరోపిస్తూ దేశ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నా కు వస్తున్న ప్రజధారణను చూసి భయపడిన కేంద్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఆయనను అరెస్ట్ చెయ్యడంపై జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భగ్గుమన్నయి. ప్రభుత్వ అతిధి గృహం ముందు పార్టీ నాయకులతో కలిసి అరెస్ట్ కు నిరసనగా నరేష్ గౌడ్ బృందం రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా టైర్లు కాల్చి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం రోజు రోజుకు దిగజారుతూ బిజెపి ప్రభుత్వం వంత పడడం దౌర్భాగ్యమని, కాంగ్రెస్ పార్టీ ఎక్కడ పటిష్టంగా ఉంటే అక్కడ అడ్డదారుల్లో ఎస్ఐఆర్ అనే చట్టావ్యతిరేకమైన సాధనం ద్వారా అనేక రాష్ట్రల్లో లక్షల సంఖ్యలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను దొంగదారిలో తొలగిస్తుందని, ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపతమైన ఓటింగ్ నిర్వహించి ప్రజల మన్ననలు, నమ్మకం సాధించుకోవాలి తప్ప బీజేపీ కోసం పని చేయొద్దనీ సూచించారు. కార్యక్రమంలో లచ్చ నాయక్ తండా సర్పంచ్ ప్రేమ్ సింగ్ రాథోడ్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పవార్ శ్రీనివాస్ నాయక్, 11 వ వార్డు ఇంచార్జ్ నవీద్ ఆహేమద్, విష్ణువర్ధన్ రెడ్డి, మొహమ్మద్ అక్బర్, 19 వ వార్డు ఇంచార్జ్ పి అరవింద్, జూనెద్, జనార్దన్, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భాస్కర్ లా కాలేజీ హాస్టల్‌లో పురుగుల భోజనం

### - తల్లిదండ్రులకు ఫోటోలు పంపి వాపోతున్న విద్యార్థినులు





**మొయినాబాద్, అక్టోబర్ 7:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ )**

రంగారెడ్డి జిల్లా యెంకపల్లిలోని భాస్కర్ లా కాలేజీ హాస్టల్‌లో భోజన నిర్లక్ష్యం బయటపడింది. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు వడ్డించిన పప్పు అన్నంలో జిల్లా పురుగు రావడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.భోజనం చేయబోయి ప్లేట్‌లో పురుగును గమనించిన విద్యార్థినులు వెంటనే ఫోటోలు తీసి తమ తల్లిదండ్రులకు వాట్సాప్‌లో పంపారు. "అమ్మా ఇక్కడ ఇలాంటి తిండి పెడుతున్నారు, తినలేకపోతున్నాం" అని వాపోయారు. ఫోటోలు చూసిన తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేల రూపాయలు ఫీజులు, హాస్టల్ చార్జీలు వసూలు చేస్తున్న యాజమాన్యం కనీం శుభ్రమైన, నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. యాజమాన్యానికి ఎన్నిసార్లు చెప్పినా మెస్ నిర్వహణలో మార్పు రావడం లేదని వారు తెలిపారు.ఇలాంటి కలుషిత ఆహారం వల్ల విద్యార్థినులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఉన్నత విద్యా శాఖ అధికారులు వెంటనే స్పందించి హాస్టల్ మెస్‌పై తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పారిశుద్ధ్య లోపంతో ప్రజల ప్రాణాలకు ముప్పు.

### మున్సిపాలిటీ అధికారులు తక్షణమే

### స్పందించాలని మారుతి నగర్ కాలనీవాసులు

**జవహర్ నగర్ అక్టోబర్ 07:(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**







జవహర్‌నగర్ చంద్రపురి కాలనీ-2 మారుతి నగర్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం కారణంగా స్థానికులు తీవ్రమైన దుర్వాసనను ఎదుర్కొంటూ అనారోగ్యం పాలవుతున్నారు. ఎన్నిసార్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త దిబ్బల వల్ల విచ్చలవిడిగా తిరుగుతున్న వీధికుక్కల బెడదతో పిల్లలు బయటికి రావాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది.ఈ సమస్యపై బూడిద వెంకటేష్ మాట్లాడుతూ తక్షణమే చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు.కాలనీ వాసి శ్రీవిద్య మాట్లాడుతూ దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నామని, పిల్లలు బయటికి రావడానికి కుక్కల భయంతో వణికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంజుల, హేమవతి,చ oద్రకళ,మీనాక్షీ అమ్మ, సరస్వతి,శంకరమ్మ, సురేష్,రామచందర్ తదితరులు పాల్గొని అధికారుల తీరుపై మండిపడ్డారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తొలగించి కాలనీ ప్రజలను కాపాడాలని వారు కోరుతున్నారు.

## ఈవీఎం గోదాములో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

కామారెడ్డి, అక్టోబర్ 7:-(తెలంగాణ ఎక్స్ ప్రెస్ బ్యూరో )

ఈవీఎం గోదాములో భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం నెలవారీ తనిఖీలో భాగంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధులను పరిశీలించి, గోదాము వద్ద 24 గంటల పాటు పటిష్ట భద్రత కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. పోలీసులతో సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహాన్ని భద్రంగా ఉంచాలి...

### మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్ కు వినతి....



**ఎల్లారెడ్డి, అక్టోబర్ 7,(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో గల అంబేద్కర్ విగ్రహాన్ని భద్రంగా ఉంచాలని కోరుతూ, బుధవారం అంబేద్కర్ సంఘ సభ్యులు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు వెడల్పులో భాగంగా అంబేద్కర్ విగ్రహంను అక్కడి నుండి తీసి మున్సిపల్ ఆఫీస్ లో భద్రంగా ఉంచి, రోడ్డు పనులు పూర్తయిన తర్వాత రోడ్డు మధ్యలో పెట్టాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ ను కోరడం జరిగిందన్నారు. ఈ విషయమై హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం ద్వారా తెలియ జేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ గాదే తిరుపతి, ఎల్లారెడ్డి మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మ్యాతరి అమృత రావు, డివిజన్ అధ్యక్షులు మర్లు సాయిబాబా, పట్టణ అధ్యక్షులు ఎర్రోళ్ల ఎల్లుబాబు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ మెగావత్ కనిరాం, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**జవహర్ నగర్ అక్టోబర్ 07:(తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

జవహర్‌నగర్ పరిధిలోని 33/11 కేవీ బాలానగర్ (బాలాజీ నగర్) సబ్ స్టేషన్ పరిధిలో హెచ్ఆర్‌డీసీఎల్ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం అక్టోబర్ 8, 2026 (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. 11 కేవీ ఫీడర్లను కొత్తగా ఏర్పాటు చేసిన టవర్లు మరియు పోల్స్‌పైకి మార్చే పనుల కారణంగా వివిధ ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు ఏఈ హెచ్. సాంబశివ రావు తెలిపారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 02:00 వరకు (4 గంటలు) 11 కేవీ సాయిబాబా, శివాజీనగర్, ఆనంద్‌నగర్, మహాలీ నగర్ ఫీడర్ల పరిధిలో; మధ్యాహ్నం 02:00 నుండి సాయంత్రం 05:00 వరకు (3 గంటలు) 11 కేవీ లక్ష్మీ నరసింహ, సంతోష్ నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదు. అలాగే ఉదయం 10:00 నుండి సాయంత్రం 05:00 వరకు (7 గంటలు పూర్తి రోజు) 11 కేవీ డెంటల్ కాలేజ్ ఫీడర్ కింద పవర్ కట్ ఉంటుంది. ప్రభావిత ప్రాంతాలు: వీఆర్ఓ ఆఫీస్ రోడ్, మోహన్ రావు కాలనీ, బాలాజీ నగర్ మెయిన్ రోడ్, సిల్వర్స్ గల్లీ, వెంకటేశ్వర కాలనీ, సాయిబాబా కమాన్ రోడ్, ఫైరింగ్ కట్టా శాంతి నగర్, ఆనంద్ నగర్, మార్వాడీ లైన్, శివాజీ నగర్, సంతోష్ నగర్, చెన్నపూర్, సీఎస్ఐ చర్చి కాలనీ, భగత్ సింగ్ బీ.నగర్ మెయిన్ రోడ్, ఎక్స్-సర్పంచ్, మార్కెట్ రోడ్, సీపీఐ కాలనీ, కల్యాణ సులోచన ఎన్క్లేవ్, భిక్షపతి తోట, వీకే ఎన్క్లేవ్, సిల్వర్స్ ఈగల్ కాలనీ, ఆంధ్ర బ్యాంక్ బ్యాక్ సైడ్, చంద్రపురి కాలనీ, కేపీఎన్ కాలనీ, బిగ్ మసీద్, శ్రీరామ్ నగర్ కాలనీ, బృందావన్ కాలనీ, సిటిజెన్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుక్కం కుంట, జ్యోతి కాలనీ, బజరంగ్ నగర్, వీరభద్ర కాలనీ, న్యూ వెంకటేశ్వర కాలనీ, భక్త భాయి కాలనీ, గీతాంజలి స్కూల్, ముత్తుస్వామి కాలనీ, జేఎస్పీ స్కూల్, భద్రయ్య వెంచర్, కేఎల్ఆర్ వాటర్ ప్లాంట్, శివాలయం టెంపుల్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలు. పనులు పూర్తికాగానే విద్యుత్ సరఫరా వెంటనే పునరుద్ధరించబడుతుందని, వినియోగదారులు టీఎస్ఎస్పీడీసీఎల్ శాఖకు సహకరించాలని కోరారు.

### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి

## నా వంతు కృషి చేస్తా

### - యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ గా కంఠం విజయుడు

**ఉర్కొండ అక్టోబర్ 07,**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని ఉర్కొండ మండల కేంద్రానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కంఠం విజయుడు అన్నారు.

ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన కంఠం విజయుడు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి యువజన కాంగ్రెస్ మహబూబ్ నగర్ జిల్లా సెక్రటరీ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కంఠం విజయుడు మాట్లాడుతూ నా నియమానికి సహకారం అందించిన జడ్చర్ల నియోజకవర్గ శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డికి,ఊర్కొండ మండల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేద కుటుంబాల ఆపత్బంధవుడు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ మదారం మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి కి ,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కంఠం విజయుడు జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీగా ఎన్నికైనందున మండల యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, తోటి మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.



# పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్, అక్టోబర్ 07, (తెలంగాణ ఎక్స్ ప్రెస్):**

పత్తి పంట కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పత్తి పంట కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం సాగుచేసిన పత్తి పంట వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంట కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ నమోదు చేసుకొని రైతులు తమ పంటను అమ్ముకోవచ్చన్నారు. రైతులెవరూ నష్టపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వివరించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, సిసిఐ అధికారులు శరత్, వ్యవసాయ అధికారి సుజాత, జిల్లా మార్కెటింగ్ అధికారి గంగు, వివిధ వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ లు భీమ్ రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్, కళ్యాణ్, భైంసా ఎఎంసి వైస్ చైర్మన్ ఫారూఖ్ సిద్ధికి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పుష్కరాల పనులకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాల పనులపై నిరంతర పర్యవేక్షణ కోసం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం పకడ్బందీగా పని చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద ఆయా నిర్మాణ పనులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఇప్పటినుంచే కట్టుదిట్టమైన చర్యల వల్ల గోదావరి పుష్కరాల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, సిపిఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, హౌసింగ్ పిడి శ్రీనివాస్, నీటిపారుదల, ఆర్ అండ్ బి ఈఈ లు అనిల్, సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు. అంగన్వాడీ టీచర్ల భర్తీ పారదర్శకంగా చేపట్టాలి

నిర్మల్ జిల్లాలో 89 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు, అర్హతల పరిశీలన, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియలో అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించాలని, ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా అవసరమైన స్థాయిల్లో పత్రాలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, తదుపరి దశల వివరాలను దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హత పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే, పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, భర్తీ చేయిస్తామని చెప్పే వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని ఆయన సూచించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించి అధికారిక సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సీడీపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలి

## మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్

**మక్తల్ రూరల్ అక్టోబర్7**

మక్తల్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమలపైన సంబంధించిన అధికారులు స్పందించి వెంటనే విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు బుధవారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక మున్సిపాలిటీలో 16 వార్డుల్లో ఎలాంటి పర్మిషన్ లేకుండా ఒక్కొక్క వార్డులో లక్ష రూపాయలు చొప్పున కేటాయించుకొని పనులు చేయకుండానే బిల్లులు ఎత్తుకోవడం జరిగిందని ఆయన ఆరోపించారు అదేవిధంగా ఈ మధ్యకాలంలో 12 మందిని అవుట్ సోర్సింగ్ కింద అధికారుల అనుమతి లేకుండా నియామకం చేసుకొని ఒక్కొక్కరి దగ్గర లక్ష నుంచి 2 లక్షల రూపాయలు వసూలు చేసిన చరిత్ర ఈ పాలకవర్గానికి దక్కుతుందని ఆయన విమర్శించారు విషయంపై న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు పట్టణంలో పారిశుద్ధ్యం పనుల కోసం టెండర్లు వేసి ఆ పనులు చేయకుండా ప్రస్తుతము ఆ పనులలో మున్సిపాలిటీ సిబ్బందితో చేయించడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు పాలకవర్గం మొదటి సంవత్సరం పూర్తి కాకముందే ఇలాంటి అక్రమాలకు అవినీతికి పాల్పడుతుంటే స్థానిక మంత్రి ఏం చేస్తున్నాడని ఆయన ప్రశ్నించారు అవినీతి అక్రమాల లో మంత్రి కి తెలిసి జరుగుతుందా తెలియక జరుగుతుందో ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు కాంగ్రెస్ పాలలో అవినీతి తప్ప అభివృద్ధి ఏం జరగడం లేదని రాష్ట్రంలో అదే పరిస్థితి నియోజకవర్గంలో అదే పరిస్థితి నెలకొంది అని ఆయన ఆరోపించారు మున్సిపాలిటీని ఏర్పాటు చేయడం వలన పట్టణము అభివృద్ధి చెందుతుందని ఆశించాం కానీ ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడడానికి కాంగ్రెస్ కు అధికారం ఇవ్వలేదని విషయాన్ని ఆ పార్టీ నాయకులు పాలకవర్గబ ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు పట్టణంలో మంచినీటి కొరతతో పాటు పారిశుద్ధ్యం లోపం తీవ్రంగా ఉందని దీనిపైన పురపాలక కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టాలి అని కోరారు ఈ విషయంపై సంబంధించిన అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో మున్సిపాలిటీ కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఏ మహిపాల్ రెడ్డి.పట్టణ పార్టీ అధ్యక్షుడు జ చిన్న హనుమంతు. గుర్లపల్లి సర్పంచ్ గాలి రెడ్డి. మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేను జగ్గలి రాములు ఎరుకలు మొగిలఅప్ప పార్టీ నాయకులు జుట్ల శంకరు శివారెడ్డి రఘు అమ్రేష్ మనన్ రామలింగం ఈశ్వర్ యాదవ్ అశోక్ కుమార్ యాదవ్ కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**మక్తల్ రూరల్ అక్టోబర్7**

మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదో తరగతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి విషయ పరిజ్ఞానం, చదువుపై ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి అనంతరం ఏం చదవాలని అనుకుంటున్నారని విద్యార్థులను కలెక్టర్ ప్రశ్నించారు. డాక్టర్లు, ఇంజనీర్లు, పోలీసు అధికారులు కావాలనుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నారో తెలుసుకున్నారు. ఐఏఎస్ కావాలంటే ఏ విధంగా చదవాలి, సివిల్స్ పరీక్షల్లో ఎలాంటి అంశాలు ఉంటాయనే విషయాలను విద్యార్థులకు వివరించారు. సివిల్స్ పరీక్షల్లో ప్రాథమిక విషయ పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, 8, 9, 10వ తరగతుల్లో చదివే సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరమని కలెక్టర్ తెలిపారు. కేవలం బట్టీ పట్టి చదవడం కాకుండా విషయాన్ని అర్థం చేసుకుని చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో లక్షలాది మంది పాల్గొన్నప్పటికీ తమ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇతరులు చదవడం లేదనే కారణంతో తాము చదువును నిర్లక్ష్యం చేయవద్దని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. చదువుతో పాటు ఆటలు ఆడాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం 5, 6వ తరగతి విద్యార్థులు రాస్తున్న ఎస్ఏ-1 పరీక్షను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల వంటగదిని సందర్శించిన కలెక్టర్ కూరగాయల నిల్వలు, విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి అక్కడ పాఠశాల యూనిఫాంలు, బెడ్‌షీట్లు నిల్వ ఉంచడంపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసిల్దార్ సతీష్ కుమార్, పాఠశాల హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# చిక్ లుక్‌లో మీనాక్షి చౌదరి

- ట్రెండింగ్‌లో తాజా ఫొటోలు
- స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో మెరిసిన టాలీవుడ్ భామ



# రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్న కియారా-సిద్ధార్థ్



- అభిమానులకు శుభవార్త చెప్పిన బాలీవుడ్ జంట
- ప్రత్యేక ఫొటోతో సోషల్ మీడియాలో ప్రకటన

ముంబై: బాలీవుడ్ స్టార్ జంట కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా మరోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు ప్రకటించారు. తమ కుమార్తె సారాయాతో పాటు చిన్నారి బూట్లను చూపిస్తూ ప్రత్యేక ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "మరోసారి గొప్ప బహుమతితో ఆశీర్వదించబడ్డాం.. మా హృదయాలు ప్రేమ, కృతజ్ఞతతో నిండిపోయాయి" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. 'షేర్షా' సినిమా సమయంలో ప్రేమలో పడిన కియారా–-సిద్ధార్థ్ 2023 ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నారు. 2025 జూలైలో వీరికి కుమార్తె సారాయా జన్మించింది. తాజాగా రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్నారనే వార్తతో సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలిపారు.

# స్టైలిష్ లుక్‌లో నైనా గంగూలీ

- తాజా ఫొటోషూట్‌తో ఆకట్టుకుంటున్న అందాల భామ
- గ్లామర్‌తో పాటు కూల్ అటిట్యూడ్‌తో మెస్మరైజ్

ఫిల్మ్ డెస్క్: నైనా గంగూలీ తాజా స్టైలిష్ ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. టీల? రంగు సోఫాపై కూర్చుని బ్రౌన్ క్రాప్ టాప్, చెక్స్ స్కర్ట్, స్టైలిష్ బూట్స్‌లో ఆమె ఇచ్చిన ఫోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సహజమైన హావభావాలతో కాన్ఫిడెంట్‌గా కనిపించిన నైనా.. తనదైన స్టైల్‌తో ఫొటోలకు మరింత గ్లామర్ అద్దింది. కోల్‌కతాలో జన్మించిన నైనా గంగూలీ 2016లో 'వంగవీటి' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసింది. తెలుగు సినిమాలతో పాటు హిందీ, బెంగాలీ, కన్నడ చిత్రాలు, వెబ్ సిరీస్‌లలోనూ నటించింది. 'చరిత్రహీన్', 'జోహార్', 'మళ్లీ మొదలైంది', 'డేంజరస్' తదితర ప్రాజెక్టులతో గుర్తింపు తెచ్చుకున్న నైనా.. తాజాగా తన ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.



# ఆర్బీఐ షాక్.. స్టాక్ మార్కెట్ కుదేలు!



- 429 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 173 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- మెటల్ షేర్లలో అమ్మకాలు.. పీఎస్‌యూ బ్యాంకులకు లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లకు బుధవారం ఆర్బీఐ నిర్ణయం షాకిచ్చింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. ఫలితంగా సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద, నిఫ్టీ 173.05 పాయింట్లు కోల్పోయి 22,603.05 వద్ద ముగిశాయి. వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది.

ఆర్బీఐ ద్రవ్య విధాన వైఖరిని 'క్యాలిబ్రేటెడ్ టైటనింగ్'గా మార్చడంతో వడ్డీ రేట్లు మరింత కఠినంగా ఉండొచ్చన్న ఆందోళన నెలకొంది. దీంతో ముఖ్యంగా మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. టైటాన్, బీఈఎల్, హిందాల్కో షేర్లు నష్టపోయాయి. నిఫ్టీ మెటల్ సూచీ బలహీనపడగా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ లాభాల్లో ముగిసి కొంత మద్దతిచ్చింది. రానున్న సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు, కంపెనీల ఆదాయాలు, ఉత్పత్తి వ్యయాలు, డిమాండ్ పరిస్థితులపై ఇన్వెస్టర్ల దృష్టి నెలకొంది.

# కన్నీళ్లతో మెస్సీ వీడ్కోలు.. చివరి మ్యాచ్‌లోనూ గోల్!

- 21 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు
- 85 వేల మంది అభిమానుల మధ్య భావోద్వేగ వీడ్కోలు
- అర్జెంటీనా జెర్సీలో చివరిసారి మెరిసిన ఫుట్‌బాల్ దిగ్గజం

స్పోర్ట్స్ డెస్క్, ప్రజా ప్రతిభ: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ కెరీర్‌కు భావోద్వేగ ముగింపు పలికాడు. 21 ఏళ్లుగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మెస్సీ.. బెనిన్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లోనూ గోల్ చేసి అభిమానులను అలరించాడు. 85 వేల మంది అభిమానుల సమక్షంలో జరిగిన ఈ వీడ్కోలు వేడుకలో మెస్సీ పలుమార్లు కన్నీళ్లు తుడుచుకున్నాడు. ముగ్గురు పిల్లలతో కలిసి మైదానంలోకి వచ్చిన మెస్సీ.. కుటుంబ భ్యులు, అభిమానులకు చేతులు ఊపుతూ భావోద్వేగానికి గురయ్యాడు.చివరి మ్యాచ్‌లోనూ గోల్.. 126వ అంతర్జాతీయ గోల్ అర్జెంటీనా 3-0తో బెనిన్‌పై విజయం సాధించగా.. తొలి గోల్‌కు మెస్సీ అసిస్ట్ అందించాడు. 71వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచిన మెస్సీ.. అంతర్జాతీయ కెరీర్‌లో 126వ గోల్ నమోదు చేశాడు. అర్జెంటీనా తరఫున ఇది అతడి 208వ మ్యాచ్. మెస్సీ జెర్సీ నంబర్ పదికి గుర్తుగా మ్యాచ్ 10వ నిమిషంలో ఆటను నిలిపివేసి అభిమానులు చప్పట్లతో ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రపంచకప్ విజేతగా చిరస్థాయిగా..2022లో అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించిన మెస్సీ.. రెండు కోపా అమెరికా టైటిళ్లను కూడా సాధించాడు. జాతీయ జట్టుకు ఇక ఆడబోనని యించుకున్నప్పటికీ.. క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగనున్నాడు. ఇంటర్ మయామితో 2028 వరకు ఒప్పందం ఉన్న మెస్సీకి చివరి మ్యాచ్ అనంతరం స్టేడియంలో ప్రత్యేక డ్రోన్ షో నిర్వహించారు. ఆకాశంలో మెస్సీ రూపాన్ని ప్రదర్శిస్తూ అభిమానులు తమ అభిమాన ఆటగాడికి ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు.







Printed, published and owned by **Chinthala Neelakantam,** and Printed at **Ritesh Printers,** H.NO.5-178, SC Colony, Village &Mandal-Narnoor, Dist. Adilabad-504311, Telangana., and Published at H.No. 5-178, SC Colony, Narnoor, Dist. Adilabad- 504311,Telangana.
**Editor: Chinthala Neelakantam, RNI. NO.TEL TEL/2014/57821.,** Cell: 9010002679, E-Mail Id : Telanganaexpress521@gmail.com